ఎన్నాళ్లీ యాతన!

- ఉప్పల్–నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో తీవ్ర జాప్యం
- ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేకపోతున్న అధికార యంత్రాంగం
- ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నా స్పందించని పాలకులు

మీతో సాక్షి


చెంగిచర్ల చౌరస్తా వద్ద ఆగిపోయిన పనులు


ఉప్పల్ బస్ స్టాండ్ వద్ద రోడ్డు దుస్థితి


ఆగిన కారిడార్ పనులు, గుంతల మయమైన రోడ్డు

ఉప్పల్: ఉప్పల్–నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. ఆరేళ్లుగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. పరిసర ప్రాంతాల ప్రజలతోపాటు వాహనదారులు పడరానిపాట్లు పడుతున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో ప్రాణాలూ కోల్పోతున్నారు. అయినా అధికారులు, పాలకుల్లో చలనం లేకపోవడం గమనార్హం.

కారిడార్ నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభం అయ్యాయంటే...

వరంగల్ జాతీయ రహదారిపై ఉప్పల్ నుంచి నారపల్లి వరకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ఆయా సమస్యలను అధిగమించేందుకు ఉప్పల్–నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని తలపెట్టింది ప్రభుత్వం.

◆ ఉప్పల్ నుంచి నారపల్లి వరకు 6.2 కిలో మీటర్ల మేర స్కైవే నిర్మాణ పనులు 2018 జూన్‌లో ప్రారంభమయ్యాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఈ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 148 పిల్లర్లతో 6.2 కిలోమీటర్ల పొడవున నిర్మించ తలపెట్టిన పనులను అప్పటి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. 2018 జులైలో ప్రారంభించిన పనులు జూన్ 2020కి ముందే పూర్తి కావాల్సి ఉంది. ఉప్పల్ ఎలక్ట్రికల్ జంక్షన్ నుంచి ప్రారంభమయ్యే కారిడార్ నారపల్లి సీపీఆర్‌ఐ వద్ద ముగుస్తుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్ట్ వ్యయం రూ. 625 కోట్లు.

రెండు భాగాలుగా కారిడార్ నిర్మాణం...

◆ ఉప్పల్–నారపల్లి కారిడార్ వంతెన ఉప్పల్‌లో మహంకాళి దేవాలయం వద్ద దిగడం, ఎక్కడం ఉండేది. బాటిల్ నెక్‌గా ఉన్న ఈ రోడ్డుతో భవిష్యత్‌లో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలం అవుతుందనే విషయాన్ని గమనించిన అధికారులు వంతెనను దేవాలయం నుంచి రామంతాపూర్ రోడ్డు డీఎస్‌ఎల్ మాల్ వరకు పొడిగించాలని ప్రతిపాదించారు. ఈ అంశాన్ని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పనులను జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ విభాగానికి అప్పగించింది. దీని అంచనా విలువ దాదాపు రూ. 390 కోట్లు. ఆ విభాగం పనులకు అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఉప్పల్ వీటీ కమాన్ నుంచి డీఎస్‌ఎల్ మాల్ వరకు వంతెన నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ చేపట్టింది. మొత్తం 43 పిల్లర్లు ఉండగా ఇప్పటికే 31 పిల్లర్లను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

సమన్వయం లేనందునే...



గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాల మధ్య సమన్వయం లేనందునే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరిగిందనేది జగమెరిగిన సత్యం. ఆరు సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు నిత్యం ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నారు. రోడ్డు సరిగా లేని కారణంగా అమాయకులు, విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి పరిస్థితిని వివరించాం. ఆయన వెంటనే స్పందించి ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను సందర్శించారు. రెండు సంవత్సరాల్లో పూర్తి చేయించి పూర్తిగా వినియోగంలోకి తీసుకొస్తామని అన్నారు. ఆలోపు కింద రోడ్డును వేయిస్తామని హామీ కూడా ఇచ్చారు.

– కుర్ర శివకుమార్, డిప్యూటీ మేయర్, పీర్జాదిగూడ

కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే...



గతంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే ఎలివేటెడ్ కారిడార్ పనులు ఆరు సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం నాలుగు సంవత్సరాల్లోనే 36 ఫ్లై ఓవర్లు పూర్తి చేసింది. బీజేపీ ప్రభుత్వం చేపట్టిన రెండు ఫ్లై ఓవర్ పనుల్లో ఒకటి కూడా పూర్తి చేయలేక పోయింది. ఇదీ వారికి ప్రజలపై ఉన్న శ్రద్ధ. ఏదేమైనా కారిడార్ పనులు ఎప్పటికైనా పూర్తి చేసుకోం కానీ కింద ఆరు లైన్ల రోడ్డును వెంటనే పూర్తి చేసి ఫుట్‌పాత్, సర్వీస్ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచి ప్రజలకు ఊరట కలిగించాలి.

– జక్కా వెంకటరెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్

వర్షం పడితే అంతే...



వర్షం వచ్చిందంటే చాలు ఉప్పల్ ప్రాంతంలోని రోడ్లు ఆగమే. ఎక్కడ గుంత ఉందో... ఎక్కడ డ్రైనేజీ ఉందో ఎవరికీ తెలియదు. రోడ్డంతా వరద నీటితో చెరువును తలపించేలా ఉంటుంది. దీంతో విపరీతంగా ట్రాఫిక్ జాం అవుతుంది. గడచిన ఆరేళ్లుగా ఈ తంతు కొనసాగుతున్నా పట్టించుకునేవారే లేదు.

– పి.సుధాకర్, ప్రైవేట్ ఉద్యోగి

ఆటోలకు గిరాకీ లేదు



రోడ్లు సరిగా లేని కారణంగా ఆటోలకు గిరాకీలు ఉండటం లేదు. ఉప్పల్ ప్రాంతం అంటేనే ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. గుంతల రోడ్ల వల్ల కొత్త ఆటోలు కూడా పాడవుతున్నాయి. రోడ్లపై దుమ్ము ధూళితో నిత్యం ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నాం. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు.

– చంద్రయ్య, ఆటో డ్రైవర్, చెంగిచర్ల

స్వచ్ఛ బోడుప్పల్ సాధనకు నడుం బిగిద్దాం

మేయర్ తోటకూర అజయ్‌యాదవ్


స్వచ్ఛ ఆటోను ప్రారంభిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: పరిసరాల పరిశుభ్రతతోపాటు ప్రతి ఒక్కరూ స్వచ్ఛ బోడుప్పల్ సాధన కోసం నడుం బిగిద్దామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ పిలుపునిచ్చారు. బోడుప్పల్‌లో శుక్రవారం నూతనంగా కొనుగోలు చేసిన స్వచ్ఛ ఆటోలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తాచెదారంను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. పరిశుభ్రంగా ఉందాం, ప్రగతిని సాధిద్దామని పిలుపునిచ్చారు. చెత్తను ఎవరైన రోడ్లపై వేస్తే వారికి జరిమానాతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చీరాల నర్సింహా, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. నారాయణరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతి పుత్రా ప్రణామం

మల్కాజిగిరి, ఉప్పల్ జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం గణపయ్యకు మండపాల నిర్వాహకులు వైభవంగా పూజలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు విఘ్నేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో గణేషుడి నిమజ్జనాలు నిర్వహించారు.

– మల్కాజిగిరి, ఉప్పల్ జోన్ల బృందం


సఫిల్‌గూడ ఘాట్ వద్ద ..


విమలాదేవినగర్‌లో..


నెహ్రూనగర్ ఏకదంత ఫ్రెండ్స్ యూత్ కమీటి ప్రతి నిధులు


ప్రత్యేక పూజలో ఎస్వీనగర్ యువ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు


మారుతీనగర్‌లో.. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు


గౌతంనగర్ సాయిపురి కాలనీలోని వీఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ వినాయకుడికి పూజలు


మిర్జాలగూడ చిన్మయిమార్గ్ వద్ద గ్రీన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


గౌతంనగర్ ఏకలవ్యనగర్‌లో..

క్రీడలతో మానసిక ఉల్లాసం



అల్వాల్: అల్వాల్ పోలీస్‌స్టేషన్ సహకారంతో గోల్నాక ప్లే గ్రౌండ్‌లో శుక్రవారం కమ్యూనిటీ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పోలీసులకు, కమ్యూనిటీ వారికి స్నేహపూర్వక బంధం ఏర్పడే విధంగా ఈ టోర్నమెంట్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ పోటీలో పోలీస్‌స్టేషన్ టీమ్, లోతుకుంట, గోల్నాక యూత్ క్లబ్, బాయ్స్ హైస్కూల్ ఓల్డ్ అల్వాల్, వైష్ణవి మాత టెంపుల్ టీమ్, కంటోన్మెంట్, అంబేడ్కర్‌నగర్ టీమ్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు సురేష్, శంకర్‌గౌడ్, అంబిక, వర్మ, చందిల్, మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన

ఘట్‌కేసర్: రెడ్ రిబ్బన్ క్లబ్ విజేతలుగా నిలిచిన అంకుషాపూర్‌లోని సాంఘిక సంక్షేమ ఇబ్రహీంపట్నం గురుకుల కళాశాల విద్యార్థినులను ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక శుక్రవారం అభినందించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సిద్దార్థ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రెడ్ రిబ్బన్ క్లబ్ క్రీడా పోటీల్లో కళాశాలకు చెందిన చలన పరుగు పందెంలో మొదటి బహుమతి, పోస్టర్ తయారీ పోటీలో హరిణి, దయాన తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. క్రీడా విజేతలతో పాటు నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థి ఛాయకు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

కాప్రా చెరువును పరిశీలించిన ఎన్‌హెచ్‌ఆర్సీ బృందం



కాప్రా: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) బృందం సభ్యులు శుక్రవారం కాప్రా చెరువును పరిశీలించారు. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులు కాప్రా చెరువు మొత్తం కలియతిరిగి పరిశీలించారు. మూడున్నర గంటల పాటు చెరువును పరిశీలించి ఆక్రమణలపై ఆరా తీశారు. వర్షపునీటి ఇన్‌లెట్, ఔట్‌లెట్‌లను పరిశీలించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లో ఇప్పటికే నిర్మాణాలు, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో కొనసాగుతున్న నిర్మాణాలకు సంబంధిత అధికారులు నోటీసులు ఇచ్చారా లేదా, చెరువు చుట్టు ఫెన్సింగ్ ఎందుకు పూర్తి కాలేదనే అంశాలపై ఆరా తీశారు. హ్యూమన్ రైట్స్ కమిషన్ డిప్యూటీ రిజిస్ట్రార్ కేకే శ్రీవాస్తవ, డిప్యూటీ ఎస్పీ లాల్ భహర్ ఇతర అధికారులు, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి


ఏఎస్‌రావునగర్‌లో...


ఉప్పల్ సీపీఎం కార్యాలయంలో ఏచూరికి నివాళులర్పిస్తున్న నేతలు


ఈసీఐఐఎల్ చౌరస్తాలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు


నాచారంలో...

సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మరణం తీరని లోటు అని పలువురు విచారం వ్యక్తం చేశారు. ఉపల్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో సీపీఎంతోపాటు అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు సీతారాం ఏచూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలకు కొనియాడారు. నేటి యువతకు ఆయన పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని పిలుపునిచ్చారు.

– ఉప్పల్ జోన్ బృందం

బీఆర్‌ఎస్ నేతల ముందస్తు అరెస్టులు


కుషాయిగూడ పీఎస్‌లో కార్పొరేటర్ ప్రభుదాస్ తదితరులు

ఉప్పల్ జోన్ బృందం: ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీల మాటల యుద్ధంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కిన విషయం తెలిసిందే. రెండు రోజులుగా చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలను పోలీసులు శుక్రవారం ఉదయం నుంచే అరెస్టు చేసి సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సాయంత్రం పోలీసులు అరెస్టు చేసిన బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హౌస్ అరెస్ట్

కాప్రా: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని అతని నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కాప్రా సర్కిల్ సైనిక్‌పురిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హౌస్ అరెస్ట్ చేశారు పోలీసులు.


ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు


చర్లపల్లి పీఎస్‌లో ప్రభాకర్‌రెడ్డి తదితరులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ అనంతసరస్వతీనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల వల్ల ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అనంతసరస్వతీనగర్, షిరిడీనగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో, 11 కేవీ ఎన్‌ఎండీసీ కాలనీ ఫీడర్ పరిధిలో కల్యాణ్‌నగర్, ఎన్‌ఎండీసీ కాలనీ, ఆనంద్‌బాగ్ ఈస్ట్, బ్యాంక్ కాలనీ, తాళ్లబస్తీ, 11 కేవీ ఆర్‌కేనగర్ ఫీడర్ పరిధిలో ఆర్‌కేనగర్, చాణుక్యపురి, ఆనంద్‌బాగ్ వెస్ట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



మల్కాజిగిరి: మల్కాజిగిరి సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి మల్కాజిగిరి చౌరస్తాలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు కోమటి రవి మాట్లాడుతూ.. పార్టీ పోరాట యోధుడిని కోల్పోయిందన్నారు. ఆయన మార్గదర్శకంలో ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కృపాసాగర్, ఇతర పార్టీ నాయకులు నర్సింహగౌడ్, గిరి, కరణం గోపి, చంద్రశేఖర్, లక్ష్మణ్, కొండల్, మంగ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం


క్యాంటీన్‌ని ప్రారంభిస్తున్న డీసీ శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: జీహెచ్‌ఎంసీ అల్వాల్ సహకారంతో ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్‌ని శుక్రవారం అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైనా సాధించే శక్తి మహిళకు ఉంటుందన్నారు. అదేవిధంగా అందరి మన్ననలు పొంది వ్యాపారం అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉమాదేవి, లక్ష్మి, మంజుల, ప్రాజెక్ట్ ఆఫీసర్ మదన్మోహన్, ఏఎంసీ నర్సింహారెడ్డి, సూపరిండెంటెండ్ స్వామి, నారాయణ, ప్రవీణ్, సురేష్, స్వరూప, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి


పార్కులో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని వినాయక్ నగర్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏక్ పేడ్ మాకే నామ్ పిలుపు మేరకు హార్టికల్చర్ డిపార్టుమెంట్ వారు వినాయక్‌నగర్ డివిజన్ ఆనంద్‌బాగ్ పార్కులో అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పాల్గొని అధికారులతో కలిసి మొక్కలను నాటారు. హార్టికల్చర్ మేనేజర్ మహేశ్వరి, సూపర్ వైజర్ వెంకటేష్, కాలనీవాసులు జాయింట్ సెక్రటరీ రవికుమార్, సెక్రటరీ జయకుమార్, ఉపాధ్యక్షులు నర్సింగ్‌రావు, కోశాధికారి తులసి తదితరులు పాల్గొన్నారు.

హెబ్సిబారాణికి ఉత్తమ టీచర్ అవార్డు


ఉత్తమ టీచర్ హెబ్సిబారాణి అవార్డు

అల్వాల్: జిల్లా స్థాయి ఉత్తమ టీచర్ అవార్డును జి.హెబ్సిబా రాణి అందుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం చౌదరిగూడ సెయింట్ పాల్స్ స్కూల్ హెచ్‌ఎం జి.హెబ్సిబా రాణికి జిల్లా కలెక్టర్ గౌతం పాట్రు, విద్యాశాఖ అధికారి విజయకుమారి అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందజేసి సన్మానించారు. విద్యా రంగంలో హెబ్సిబారాణి చేస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

జీహెచ్‌ఎంసీ ఆధీనంలోకి జైజవాన్ షాపింగ్ కాంప్లెక్స్!

కాప్రా: ఆ షాపింగ్ కాంప్లెక్స్ పై దశాబ్ద కాలంగా అనేక ఫిర్యాదులు, మరెన్నో వినతులు, ఇంకెన్నో డిమాండ్లు. వాటన్నింటికీ ఎట్టకేలకు మోక్షం లభించింది. వివరాలివీ... ఏఎస్‌రావునగర్ డివిజన్ జైజవాన్ కాలనీలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ఎట్టకేలకు జీహెచ్‌ఎంసీ ఆధీనంలోకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఎస్టేట్ విభాగం అధికారులు పరిశీలించారు. ఇక త్వరలోనే సదరు షాపింగ్ కాంప్లెక్స్ వారి ఆధీనంలోకి వెళ్తున్నట్లు సమాచారం.

రోడ్డు పనుల పరిశీలన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హెచ్‌ఎండిఏ నిధులతో చేపట్టిన పీర్జాదిగూడ, పర్వతాపూర్ రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం మేయర్ అమర్ సింగ్, హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. వీలైనంత త్వరగా రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొడిగె కృష్ణ గౌడ్, యాసారం మహేష్, తవిటి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.